తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్

94949 23460



https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

శుక్రవారం

10 ఏప్రిల్ 2026

సంపుటి 03

సంచిక 182

పేజీలు 8

వెల రూ. 5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com


## మూడు రాష్ట్రాల్లో ప్రశాంతంగా

# ముగిసిన పోలింగ్

- అధిక శాతం ఓటింగ్ నమోదు
- కేరళలో 75.01% పోలింగ్ నమోదు
- అసోంలో 84.42% ఓటింగ్.. భారీ స్పందన
- పుదుచ్చేరిలో 86.92% పోలింగ్



డెస్క్, ఏప్రిల్ 09 (తరంగాలు ప్రతినిధి)అసోం, కేరళ, పుదుచ్చేరి శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో చెదురుమదురు ఘటనలు మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.కేరళ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 140 స్థానాలకు పోలింగ్ నిర్వహించగా సాయంత్రం 5 గంటల వరకు 75.01 శాతం ఓటింగ్ నమోదైంది. క్యూ లైన్లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ కన్నూరులో ఓటు హక్కు వినియోగించుకోగా, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ, ప్రతిపక్ష నేత వీడీ సతీషన్, రాజీవ్ చంద్రశేఖరన్, నటుడు మోహన్ లాల్ తదితరులు తమ ఓటు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 30,495 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 1.46 లక్షల మంది సిబ్బంది విధులు నిర్వర్తించారు.

అసోంలో కూడా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 126 నియోజకవర్గాల్లో 722 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. సాయంత్రం 5 గంటల వరకు 84.42 శాతం పోలింగ్ నమోదైంది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ గువాహటిలో ఓటు వేయగా, కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ జోర్హాట్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 31,490 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున భద్రతా సిబ్బందిని నియమించారు.

కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో 30 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 294 మంది అభ్యర్థులు పోటీ చేశారు. సాయంత్రం 5 గంటల వరకు 86.92 శాతం పోలింగ్

➤ మిగతా 2వ పేజిలో..



## ప్రతి బిడ్డకు విద్యా సౌకర్యాలు కల్పిస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- బోనకల్లులో విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ
- జూన్ 2 నుంచి అల్పాహార పథకం అమలు
- ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ ప్రమాణాల విద్య లక్ష్యం

ఖమ్మం, ఏప్రిల్ 09 (తరంగాలు ప్రతినిధి) రాష్ట్రంలో పుట్టిన ప్రతి బిడ్డకు చదువుకోవడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని బోనకల్లు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు.అక్షరమే అసలైన ఆయుధమని, విద్య ద్వారానే సమానత్వంతో కూడిన ఆదర్శ సమాజం సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణ బిడ్డలు విద్యను ఆయుధంగా మలుచుకుని ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఏ బిడ్డ కూడా ఆకలితో బడికి వెళ్లకూడదనే లక్ష్యంతో జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు అల్పాహార పథకం ప్రారంభించనున్నట్లు

➤ మిగతా 2వ పేజిలో..

## నారీశక్తి బలోపేతమే లక్ష్యం

- మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోదీ పిలుపు
- ఏప్రిల్ 16 నుంచి చారిత్రక పార్లమెంటు సమావేశం
- చట్టసభల్లో 33% మహిళా రిజర్వేషన్ లక్ష్యం
- ఐక్యంగా సహకరించాలని ప్రధానమంత్రి విజ్ఞప్తి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 09(తరంగాలు ప్రతినిధి) నారీశక్తిని బలోపేతం చేయడమే లక్ష్యంగా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని త్వరి తగతిన అమల్లోకి తీసుకురావాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన తన అధికారిక వెబ్‌సైట్‌లో బ్లాగ్ రాస్తూ కీలక విషయాలను వెల్లడించారు.ఏప్రిల్ 16 నుంచి

➤ మిగతా 2వ పేజిలో..

## నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

- రాజకీయాల్లో నిఖార్సయిన నేత
- జీవన్‌రెడ్డిని ప్రశంసించిన కెటిఆర్
- జగిత్యాలలో జీవన్‌తో భేటీ



జగిత్యాల, ఏప్రిల్ 09(తరంగాలు ప్రతినిధి) ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలలోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని కేటీఆర్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్,

➤ మిగతా 2వ పేజిలో..



## వైఎస్సార్ ఆశయాలకు విరుద్ధంగా జగన్ పాలన

➤ 2వ పేజిలో..

## శబరిమల ప్రవేశంపై

# సుప్రీంకోర్టులో వాదనలు

- మత విశ్వాసాల అంశమని కేంద్రం అభిప్రాయం
- మహిళల ప్రవేశ ఆంక్షలపై కేంద్రం సమర్థన
- పురుషులకూ కొన్ని ఆలయాల్లో పరిమితులు ఉన్నాయని వాదన
- మత ఆచారాలపై నిర్ణయాధికారం కోర్టుకుందా అనే చర్చ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 09(తరంగాలు ప్రతినిధి) శబరిమల ఆలయంలో 10 నుంచి 50 ఏళ్ల మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షల విషయంలో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో తన వాదనలు కొనసాగించింది. ఇది మత విశ్వాసాలకు సంబంధించిన అంశమని, రాజ్యాంగ నైతికతతో కాకుండా సంప్రదాయాల ప్రాతిపదికన చూడాలని కేంద్రం అభిప్రాయపడింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

➤ మిగతా 2వ పేజిలో..



జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
శుక్రవారం, 10 ఏప్రిల్, 2026
GENERAL NEWS


# ప్రతి బిడ్డకు విద్యా సౌకర్యాలు కల్పిస్తాం

➢ మొదటి పేజీ తరువాయి



ప్రకటించారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు తెలిపారు. విద్యపై ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోందని, ఆ పెట్టుబడులు వృథా కాకుండా విద్యార్థులను ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దాలని అన్నారు. రాష్ట్రంలో పుట్టిన ప్రతి బిడ్డ తన సామర్థ్యానికి అనుగుణంగా చదువుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలను భారీ స్థాయిలో నిర్మిస్తూ, డిజిటల్ విద్య, క్రీడా సదుపాయాలు, హాస్టల్ సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసి ఉచితంగా నాణ్యమైన విద్య అందించనున్నట్లు వెల్లడించారు.ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడకుండా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉచితంగా మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.

## తాత్కాలిక కాల్పుల విరమణ జరిగినా....

- **సైనిక బలగాలు ఇరాన్ చుట్టూ కొనసాగుతాయి**
- **స్పష్టం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

వాషింగ్టన్,ఏప్రిల్9 అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ పూర్తిగా ఒప్పందాన్ని అమలు చేసే వరకు అమెరికా సైనిక బలగాలు అక్కడే కొనసాగుతాయని తెలిపారు. ఇరాన్–అమెరికా మధ్య బుధవారం రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ తమ దేశానికి చెందిన యుద్ధ నౌకలు, విమానాలు, సైనికులు, ఆయుధాలు మొదలైనవి ఇరాన్ పరిసర ప్రాంతాల్లోనే ఉంటాయని ట్రంప్ పేర్కొన్నారు .యుద్ధం ముగింపునకు సంబంధించి పూర్తి స్థాయి ఒప్పందం అమలయ్యేంత వరకు సైనికులు వెనక్కి రారని ట్రంప్ తెలిపారు. ఒకవేళ ఒప్పందాన్ని ఇరాన్ పాటించకపోతే మునుపెన్నడూ చూడని స్థాయిలో విరుచుకుపడతామని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధి మార్గం సురక్షితంగా ఉండాలని, నౌకాయానం నిరంతరం కొనసాగాలని అన్నారు. ఒప్పందం కుదిరేవరకు అమెరికా సైన్యం అక్కడే విశ్రాంతి తీసుకుంటూ, తమ తదుపరి మిషన్ కోసం ఎదురుచూస్తుందన్నారు. మరోవైపు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు భారీగా కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం 254 మంది మరణించినట్టు వార్తలు వస్తున్నాయి. 1,100

మందికి పైగా గాయపడ్డారని సమాచారం. ముఖ్యంగా బీరుట్, దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లో నష్టం మరింత తీవ్రంగా ఉందని వార్తలు వస్తున్నాయి.

## పాక్‌ను ముందు పెట్టి అమెరికా నాటకం

- **హోర్ముజ్ తెరుచుకునేలా కాల్పుల విరమణ**
- **లెబనాన్‌పై దాడులతో మళ్లీ పీటముడి**

న్యూఢిల్లీ,ఏప్రిల్9 40 రోజుల పాటు కొనసాగిన యుద్ధానికి తెర దించుతూ అమెరికా, ఇరాన్ దేశాలు రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో రెండు దేశాల మధ్య రాజీ కుదిరింది. రెండు దేశాల మధ్య రాజీ కుదర్చటాన్ని పాకిస్థాన్ గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. తనను తాను శాంతిదూతగా చెప్పుకుంటోంది. ఇలాంటి సమయంలో బ్రిటన్‌కు చెందిన ది ఫైనాన్షియల్ టైమ్స్ న్యూస్ పేపర్ సంచలన కథనాన్ని ప్రచురించింది. ఆ కథనం ప్రకారం.. అమెరికా ఒత్తిడి కారణంగానే పాకిస్థాన్ మధ్యవర్తిత్వం చేయడానికి ముందుకు వచ్చింది. ఇరాన్, అమెరికాల మధ్య రాజీ కుదిరితే హోర్ముజ్ జలసంధి మళ్లీ తెరుచుకుంటుందని అమెరికా భావించింది. అందుకే ఇరాన్‌ను యుద్ధం ఆపేలా ఒప్పించమని పాకిస్థాన్‌ను కోరింది. గత కొన్ని వారాల నుంచి ట్రంప్ ప్రభుత్వం పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచింది. అమెరికా ఒత్తిడి కారణంగానే బలవంతంగా ఇరాన్‌తో చర్చలకు పాకిస్థాన్ ఒప్పుకుంది. ఎంతో కష్టం మీద ఇరాన్‌ను రాజీకి ఒప్పించింది. అమెరికాకు సంబంధించినంత వరకు పాకిస్థాన్ మధ్యవర్తి కాదు.. ఇరాన్‌తో సంధి చేసుకోవడానికి ఓ మార్గం మాత్రమేనని ది ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. ఇజ్రాయెల్ కారణంగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విఫలం అయ్యేలా ఉంది. ఇజ్రాయెల్ లెబెనాన్‌పై మిస్సైల్ దాడులు చేసింది. ఈ దాడుల్లో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మళ్లీ మూసి వేసింది. దీంతో ట్రంప్ ఆగ్రహానికి గురయ్యారు. గురువారం ది ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. ’అమెరికా ఈజ్ బ్యాక్. ఇప్పటికే బలహీనపడిన శత్రువును పూర్తిగా నిర్మూలించేందుకు సిద్ధంగా ఉన్నాం. హోర్ముజ్‌ను తెరవకపోతే దాడులు తప్పవు. ఒప్పందం కుదరకపోతే ఈసారి తీవ్రమైన దాడులు చేస్తాం. ఎన్నడూ లేని విధంగా ఇరాన్‌పై విరుచుకుపడతాం. ఇప్పటికే ఇరాన్ చుట్టూ అమెరికా బలగాలున్నాయి. అణ్వాయుధాలను ఇరాన్ వదలాల్సిందేనని రాసుకొచ్చారు. అయితే ఇరాన్ కూడా పట్టుదలగానే ఉంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ మరోసారి హోర్ముజ్ జలసంధిని మూసివేసింది. అమెరికా, ఇరాన్‌లు బుధవారం రెండు వారాల కాల్పుల విరమణను ప్రకటించాయి. దీనిలో భాగంగా, ప్రపంచ ఇంధన సరఫరాలను పునరుద్ధరించేందుకు వీలుగా హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. అమెరికా తీసుకున్న నిర్ణయానికి ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు మద్దతు తెలిపారు. అయితే లెబనాన్‌తో కాల్పుల విరమణ ఉండదని చెప్పారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. పది నిమిషాల వ్యవధిలో లెబనాన్‌లోని ప్రలు ప్రాంతాలపై సుమారు 100 ఎయిర్ స్ట్రైక్స్ చేసింది. ఈ దాడుల్లో దాదాపు 180 మంది ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది. 837 మంది గాయాల పాలయ్యారు. 1982 తర్వాత లెబనాన్‌పై జరిగిన అతిపెద్ద దాడి ఇదే కావడం గమనార్హం. లెబనాన్‌పై దాడులకు నిరసనగా ఇరాన్.. హోర్ముజ్ జలసంధిని తిరిగి మూసేసింది.

# మూడు రాష్ట్రాల్లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



➢ మొదటి పేజీ తరువాయి

నమోదైంది. ముఖ్యమంత్రి రంగస్వామి బులెట్ బండిపై వచ్చి ఓటు వేయడం ఆకర్షణగా నిలిచింది. మాజీ సీఎం నారాయణస్వామి కూడా తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. మూడు ప్రాంతాల్లోనూ ఓటర్లు భారీగా పాల్గొనడం గమనార్హం. ఎన్నికల సంఘం పర్యవేక్షణలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పూర్తికావడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఫలితాల కోసం రాజకీయ పార్టీలతో పాటు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

జీవన్ రెడ్డికి దశాబ్దాలకుపైగా పరస్పర గౌరవం, స్నేహం ఎప్పడి నుంచో ఉంది. రెండు సందర్భాల్లో నా కండ్ల ముందు జరిగినయ్ గుర్తొస్తున్నాయన్నారు. 2014 జూన్ 2న కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల్లో వారి మొట్టమొదటి అధికారిక ప్రకటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోనే మొదలైంది. ఆ రోజు ఉమ్మడి  కరీంనగర్ జిల్లాలో ఒక ఆడిటోరియంలో మీటింగ్ జరిగింది. జీవన్ రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ నాయకుడు, ప్రతిపక్షానికి సంబంధించిన శాసనసభ్యులు.. కానీ కేసీఆర్ స్వయంగా ముందు జీవన్ రెడ్డికి మైక్ ఇవ్వండి అని చెప్పివారి మైక్ అందిస్తే వారు నేరుగా అభినందనలు చెప్పి జగిత్యాల ప్రజల తరపున నేను మిమ్మల్ని ఒకటి అడగ దలచుకున్నా.. బోర్నపల్లి గ్రామానికి సంబంధించి ఒక బ్రిడ్జి కావాలని ఒక్క మాట చిన్నగా అడిగారు. అప్పుడే మేం కొత్తగా మంత్రులైనం. కేసీఆర్ ఎట్లా స్పందిస్తరు చూస్తా ఉన్నం. సాధారణంగా చూస్తాం.. పరిశీలిస్తాం. అని చెప్పొచ్చు. జీవన్ రెడ్డి మీదున్న గౌరవం, ప్రేమ ఎట్లాంటిదంటే.. కేసీఆర్ రూ.70 కోట్ల బ్రిడ్జిని అక్కడికక్కడే మంజూరు చేసి కరీంనగర్ జిల్లాలోనే మొట్టమొదటి మంజూరు చేసిన బ్రిడ్జిని ఇచ్చారన్నారు.. 2014 ఎన్నికల ముందు కేసీఆర్ జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. జీవన్ రెడ్డి నిబద్ధత గల నాయకుడు.. కాంగ్రెస్‌లోనే కొనసాగారు. అసెంబ్లీలో ఎప్పుడూ ప్రజా సమస్యల గురించి ముఖ్యంగా రైతుల చాలా గట్టిగా మాట్లాడే నాయకుడు. జగిత్యాల జిల్లాలో నిజాం షుగర్స్ చాలా ముఖ్యమైనదని.. దాన్ని ఖచ్చితంగా తెరిపించాల్సిందేనని విద్యాసాగర్ రావు, జీవన్ రెడ్డి ఇద్దరూ కొట్లాడేవారు. షుగర్ ఫ్యాక్టరీని ఖచ్చితంగా తెరిపించాల్సిందే.. మేం కూడా మాటిస్తున్నాం. కానీ పక్కనే ఉన్న మహారాష్ట్రలో సహకార వ్యవస్థలో అక్కడి షుగర్ మిల్లులు చాలా బ్రహ్మాండంగా నడుస్తున్నయ్. టెస్కాబ్ చైర్మన్, మాజీ అధ్యక్షుడు రవిందర్ రావు కూడా ఇక్కడే ఉన్నరు. అట్లా కో ఆపరేటివ్ వ్యవస్థను బాగు చేస్తే బాగుంటది జీవన్ రెడ్డి గారు ఒకవేళ మీకు కావాలనుకుంటే ప్రభుత్వం నుంచి రూ.250 నుంచి 300 కోట్లు పెట్టేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నామని.. అవసరమైత మీరే దానికి చైర్మన్‌గా ఉండండి.. అని చెప్పి నిండు శాసనసభలో కేసీఆర్ ఆనాడు జీవన్ రెడ్డిగారికి ఎలాంటి భేషజానికి పోకుండా ఓపెన్‌గా చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. అంతకుముందు జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలికాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది.

## పాకిస్థాన్‌పై మాకు నమ్మకం లేదు

- **ఇజ్రాయిల్ రాయబారి రూవెన్ అజార్ సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ,ఏప్రిల్9 అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు పలికిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఒప్పందంలో మధ్యవర్తిత్వ పాత్ర పోషించిన పాకిస్థాన్‌పై తమకు నమ్మకం లేదని ఆ దేశ రాయబారి పేర్కొన్నారు. భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ తాజాగా మాట్లాడుతూ.. శాంతి చర్చల్లో పాక్ పాత్రపై సందేహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం ఆ దేశాన్ని మధ్యవర్తిగా ఉపయోగించు కోవాలని నిర్ణయించుకుందని తాను భావిస్తున్నట్టు అజార్ పేర్కొన్నారు. ఏదేమైనా ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు అమెరికాతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అమెరికా–మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ మద్దతు ఇస్తోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ఇరాన్ వరకే పరిమితం అని, లెబనాన్‌పై తమ దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ రాయబారి వెల్లడించారు. ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా తొలగించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## నెతన్యాహూకు స్వదేశంలో తీవ్ర వ్యతిరేకత

**కాల్పుల విరమణ ..రాజకీయ వైఫల్యం**

**ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్ విమర్శలు**

టెలిఅవీవ్,ఏప్రిల్9 యుద్ధ లక్ష్యాలను సాధించడంలో ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు విఫలమయ్యారని ఇజ్రాయెల్ ప్రతిపక్ష నాయకులు విమర్శలు గుప్పించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్.. కాల్పుల విరమణ ఒప్పందాన్ని, ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఆక్షేపించారు. ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని రాజకీయ వైఫల్యంగా అభివర్ణించారు. యుద్ధ లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు తీవ్రంగా విఫలమయ్యారని, ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ భద్రతకు ప్రమాదకరమని యైర్ లాపిడ్ పేర్కొన్నారు. ’మన చరిత్రలో ఇంతటి రాజకీయ విపత్తు ఎన్నడూ జరగలేదు. అహంకారం, నిర్లక్ష్యం, వ్యూహాత్మక ప్రణాళిక లేకపోవడం వల్ల నెతన్యాహు కలిగించిన రాజకీయ, వ్యూహాత్మక నష్టాన్ని పూడ్చడానికి మనకు సంవత్సరాలు పడుతుంది’ అని ట్వీట్ చేశారు. సైన్యం తమకు అప్పగించిన పనులన్నీ పూర్తి చేసిందని, ప్రజలు కూడా అద్భుతమైన స్థైర్యాన్ని ప్రదర్శించారని, అయితే నెతన్యాహు రాజకీయంగా, వ్యూహాత్మకంగా విఫలమయ్యారని విమర్శించారు. తాను నిర్దేశిరచుకున్న లక్ష్యాలలో దేనినీ నెతన్యాహు సాధించలేకపోయారన్నారు.

# శబరిమల ప్రవేశంపై సుప్రీంకోర్టులో వాదనలు

➢ మొదటి పేజీ తరువాయి

నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశంపై విచారణ కొనసాగిస్తోంది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ వాదనలు వినిపించారు.

వాదనల సందర్భంగా దేశంలోని పలు ఆలయాల్లో పురుషులకు కూడా ప్రవేశం నిషేధం ఉన్న విషయాన్ని తుషార్ మెహతా ప్రస్తావించారు. కొట్టంకులంగర దేవి ఆలయంలో పురుషులు ప్రత్యేక ఆచారాల ప్రకారం మహిళల్లా వేషధారణలో మాత్రమే ప్రవేశిస్తారని తెలిపారు. అందువల్ల మత ఆచారాలు లింగ వివక్షపై ఆధారపడవని వాదించారు.మత విశ్వాసాలను పురుషాధిక్యంగా లేదా మహిళాధిక్యంగా చూడలేమని కేంద్రం పేర్కొంది. శబరిమల వ్యవహారం భక్తుల విశ్వాసాలకు సంబంధించినదిగా పరిగణించాల్సిన అవసరం ఉందని తెలిపింది. రాజ్యాంగ నైతికతను మత ఆచారాలపై రుద్దకూడదని కూడా కేంద్రం అభిప్రాయపడింది.అయితే మతపరమైన ఆచారాల్లో ఏది మూఢనమ్మకమో నిర్ణయించే అధికారం న్యాయస్థానానికి ఉందని సుప్రీంకోర్టు గత విచారణలో స్పష్టం చేసింది. న్యాయమూర్తులు చట్టపరమైన అంశాల్లో నిపుణులు అయినప్పటికీ, మత ఆచారాలపై నిర్ణయాలు తీసుకోవడం కూడా వారి పరిధిలోకి వస్తుందని వ్యాఖ్యానించింది. ఈ కేసు నేపథ్యంగా 2018లో సుప్రీంకోర్టు మహిళల ప్రవేశాన్ని అనుమతిస్తూ చారిత్రక తీర్పు ఇచ్చింది. అనంతరం దాఖలైన పునర్విచారణ పిటిషన్లను పరిగణనలోకి తీసుకుని ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేశారు. ప్రస్తుతం వివిధ మతాల్లో మహిళల హక్కులు, మత స్వేచ్ఛ అంశాలపై విచారణ కొనసాగుతోంది.

## నారీశక్తి బలోపేతమే లక్ష్యం

ప్రారంభమయ్యే చారిత్రక పార్లమెంటు సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై కీలక ప్రక్రియలు జరగనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ సమావేశాల్లో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే నారీశక్తి వందన్ అధినియం అమలుపై చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. మహిళలు పురోగమిస్తేనే సమాజం పురోగమిస్తుందని భారతీయ నాగరికత చెబుతోందని ప్రధాని అన్నారు. ఈ చట్టం కోట్లాది భారతీయ మహిళల ఆశయాలకు ప్రతిబింబంగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి నారీశక్తి బలోపేతం అత్యవసరమని స్పష్టం చేశారు.మహిళా రిజర్వేషన్ చట్టానికి ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, వ్యక్తులు అందరూ ఐక్యంగా మద్దతు ఇవ్వాలని మోదీ కోరారు. ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడంలో ఈ చట్టం కీలకమని తెలిపారు. దేశ భవిష్యత్తు కోసం ఇది ముఖ్యమైన అడుగని పేర్కొన్నారు. భారతదేశంలో మహిళలు ప్రతీ రంగంలోనూ విశేష విజయాలు సాధిస్తున్నారని ప్రధాని కొనియాడారు. విజ్ఞానం, క్రీడలు, సైన్యం, వ్యాపార రంగాల్లో మహిళలు అగ్రగామిగా నిలుస్తున్నారని తెలిపారు. గత దశాబ్దాల్లో మహిళలకు విద్య, ఆరోగ్యం, ఆర్థిక అవకాశాలు విస్తరించినట్లు గుర్తుచేశారు.

అయితే రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం ఇంకా తక్కువగానే ఉందని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. పాలనలో మహిళల భాగస్వామ్యం పెరిగితే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, నిర్ణయాల నాణ్యత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# వైఎస్సార్ ఆశయాలకు విరుద్ధంగా జగన్ పాలన

- **జగన్‌పై షర్మిల తీవ్ర విమర్శలు -**
- **వైఎస్సార్ పాదయాత్రకు 23 ఏళ్లు పూర్తి సందర్భంగా వ్యాఖ్యలు**
- **తండ్రి ఆశయాలను పాటించడం లేదని విమర్శలు**
- **ఆత్మవిమర్శన యాత్ర చేయాలని సూచన**

విజయవాడ, ఏప్రిల్ 09 (తరంగాలు ప్రతినిధి): ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తన సోదరుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. వైఎస్ రాజశేఖర రెడ్డి చేపట్టిన చారిత్రాత్మక పాదయాత్రకు 23 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా సోషల్ మీడియా ద్వారా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.వైఎస్సార్ పాదయాత్రను పేదల సంక్షేమం కోసం ప్రారంభించిన మహాయజ్ఞంగా అభివర్ణించిన షర్మిల, ఆయన కాంగ్రెస్ నాయకునిగా ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చి చిరస్థాయిగా నిలిచారని గుర్తుచేశారు. అలాంటి నాయకుడి ఆశయాలను జగన్ కొనసాగించడం లేదని ఆరోపించారు. తండ్రి పేరును పార్టీకి పెట్టుకుని ఆయన ఆలోచనలకు విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. పేదలు, దళితులు, మైనారిటీలు, మహిళలు, రైతుల సంక్షేమం కోసం కృషి చేసిన వైఎస్సార్‌కు భిన్నంగా జగన్ పాలన ఉందని పేర్కొన్నారు. మత సామరస్యాన్ని కాపాడిన వైఎస్సార్‌తో పోలిస్తే, ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రంతో రాజీ పడుతున్నారని షర్మిల ఆరోపించారు. బీజేపీ విధానాలపై జగన్ మౌనం పాటిస్తున్నారని విమర్శించారు.జగన్ ఐదేళ్ల పాలనలో దళితులు, మహిళలు, మైనారిటీలపై జరిగిన ఘటనలు సమాజాన్ని కలవరపరిచాయని పేర్కొన్నారు. ఇవన్నీ వైఎస్సార్ ఆలోచనలకు విరుద్ధమని ఆమె వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో పాదయాత్ర కంటే ఆత్మవిమర్శన యాత్ర చేయాలని షర్మిల సూచించారు. వైఎస్సార్ ఆశయాలను నిజంగా గౌరవించాలంటే ఆయన విధానాలను అమలు చేయాలని ఆమె పేర్కొన్నారు.

## తెలంగాణలో మండుతున్న ఎండలు

హైదరాబాద్,ఏప్రిల్ 9 తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే భానుడి భగభగలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరో 3 డిగ్రీలు పెరుగుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. గురువారం ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, మిగతా అన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఎండలు, వడగాలులతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో జనం బయటకు రావాలనే జంకుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. రెండు ఆవర్తన ద్రోణుల ప్రభావంతో వచ్చే వారంపాటు పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నది. బుధవారం రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది. దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలిపింది. వచ్చే మూడ్రోజులు ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే అన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో అత్యధికంగా 41.6 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో 41.5, నల్లగొండ జిల్లా నేరడుగొమ్మలో 41.5, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 41.4, జనగామ జిల్లా పాలకుర్తిలో 41.2, వరంగల్ జిల్లా సంగెంలో 41.2, హైదరాబాద్‌లో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని వెల్లడించింది. ప్రజలు బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## ప్రభుత్వ భూమికి హద్దులు నాటాలి

• సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య



**జఫర్గడ్ ప్రతినిధి, ఏప్రిల్ 9,(తరంగాలు):**

జఫర్గడ్ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 223 ప్రభుత్వ భూమికి హద్దులు నాటి కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ శ్రీనివాస్ కు ప్రభుత్వ భూమికి హద్దులు నాటి, ప్రభుత్వ భూమి కాపాడాలని వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ గతంలో కూడా ఎంతోమంది తాసిల్దార్లకు వినతి పత్రం ఇచ్చిన ఇప్పటివరకు ప్రభుత్వ భూమికి హద్దుల నాటలేదని తెలియజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రవేటు వ్యక్తుల పరం కాకముందే ప్రభుత్వ భూమికి హద్దులు నాటాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరుపేదలైన ప్రజలకు పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేసి పేద ప్రజలకు పంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, మండల కమిటీ సభ్యులు కాట సుధాకర్, ఉప సర్పంచ్ గంగరాజు, మండల కమిటీ సభ్యులు నక్క యాకయ్య, పార్టీ సభ్యులు గబ్బెట కొమురయ్య, ఆకోజు పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్ సుభాష్



**జఫర్గడ్ ప్రతినిధి, ఏప్రిల్ 9, (తరంగాలు):**

మండలంలోని షాపల్లి గ్రామంలో తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ఘన్పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ఆదేశాల మేరకు 7 లక్షల 50 వేల రూపాయల సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడమైనది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తాళ్లపల్లి సుభాష్ చంద్రబోస్,కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ మండల యాదగిరి గౌడ్, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్షలో శ్రీనిధి ఇన్స్టిట్యూట్ విద్యార్థుల ప్రతిభ




**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, ఏప్రిల్. 09, తరంగాలు:**

కేసముద్రం నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షల్లో శ్రీనిధి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్, కేసముద్రం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరుస్తూ ఘన విజయాలు సాధించారు. ఈ సందర్భంగా ఇన్స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయిలో మంచి ర్యాంకులు సాధించడం గర్వకారణంగా నిలిచింది. మామిడి సాయి హర్ష జిల్లా స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటగా, రసాల అక్షర ఫిఫ్త్ ర్యాంక్, జల్లి కీర్తన్ టెన్త్ ర్యాంక్, వల్లందాసు శాన్వి 14వ ర్యాంక్ సాధించి సంస్థకు పేరు ప్రతిష్టలు తీసుకొచ్చారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం, అలాగే ఇన్స్టిట్యూట్ అందిస్తున్న నాణ్యమైన బోధన ముఖ్య పాత్ర పోషించాయని నిర్వాహకులు తెలిపారు. క్రమశిక్షణతో కూడిన బోధన, ప్రత్యేక శిక్షణా పద్ధతులు, నిపుణుల మార్గదర్శకత్వం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ చెవ్వ వెంకటేష్, ప్రిన్సిపల్ చెవ్వ లావణ్య విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇలాంటి ప్రతిభావంతుల్ని తయారు చేయడంలో సంస్థ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లా రైల్వే సమస్యలపై

# ఎంపీ రఘురాం రెడ్డి ప్రత్యేక చొరవ

- **ఢిల్లీలో కీలక భేటి**
- **డోర్నకల్- మిర్యాలగూడ, డోర్నకల్ - గద్వాల రైల్వే లైన్ల అలైన్మెంట్ మార్చాలి**
- **ప్రత్యామ్నాయంగా వెన్నారం, కురవి, అబ్బాయి పాలెం, మరిపెడ, మోతె మీదుగా ఏర్పాటు చేయండి**
- **ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఈడీని కోరిన రామసహాయం**
- **రైల్వే నుంచి సానుకూల స్పందనతో త్వరలోనే పెండింగ్ పనులకు మోక్షం**

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**

ఖమ్మం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలపై ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్, రైల్వే బోర్డ్ చైర్మన్, సికింద్రాబాద్ రైల్వే జీఎంలను కలిసిన విషయం విదితమే. ఈ క్రమంలో తాజాగా గురువారం ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) వికాస్ కుమార్ జైన్ ను కలిసి



కీలక సమస్యలను వివరించారు. కొత్త రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యాల పెంపుపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి సానుకూల స్పందన లభించిందని ఎంపీ తెలిపారు.

### ప్రత్యామ్నాయ రైల్వే లైన్లు చేపట్టాల్సిందే..

పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల మీదుగా వెళ్ళనున్న డోర్నకల్ – మిర్యాలగూడ, డోర్నకల్ – గద్వాల రీ అలైన్మెంట్ల కోసం గతంలో పలు విజ్ఞాపనలు చేశామని, రైల్వే అధికారులు సర్వే కూడా పూర్తి చేశారని గుర్తు చేశారు.

సానుకూల స్పందన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా వెన్నారం, కురవి, అబ్బాయిపాలెం, మరిపెడ, మోతె మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాల్సిందిగా విన్నవించారు. ఇందుకోసం వేగవంతంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ నుంచి న్యూ గొల్లగూడెం మీదుగా జాతీయ రహదారి అంశం ప్రస్తావన, భూ మార్పిడి పై విన్నపం రోడ్డు విస్తరణకు కొత్తగూడెం (బీడీసీఆర్) స్టేషన్ వద్ద 4,556 చ.మీ. (5,449 చదరపు గజాలు) రైల్వే భూమి అవసరమని, ఈ భూమికి బదులుగా ఖమ్మం రైల్వే స్టేషన్ వద్ద 9,969.5 చ.మీ. రాష్ట్ర ప్రభుత్వ భూమిని రైల్వేకు ఇచ్చేందుకు సిద్ధమని వివరించారు. ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్ల నుంచి దక్షిణ మధ్య రైల్వేకు 2025, నవం బర్ 14న ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు.

# రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే

- **కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలకు విసిగి వేసారిన ప్రజలు**
- **ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ**
- **19న ఖమ్మంలో మినీ ప్లీనరి**
- **హాజరుకానున్న మాజీ మంత్రి హరీష్ రావు**

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**

ఖమ్మం : నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నివాసంలో జరిగింది. ఈ సమావేశంలో పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ దాటికి తట్టుకోలేక అధికార పార్టీ సస్పెండ్ చేసే స్థాయికి దిగజారిందని ఏద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు హామీలు నెరవేర్చ లేక బీ ఆర్ ఎస్ ప్రభుత్వం చేసిన పనులను తమ పనులుగా చూపించుకుంటూ ప్రజలను మభ్య పెడుతున్నారు. గత ఎన్నికల్లో వ్యక్తిత్వ హననం చేసి రెండు మూడు రోజులు ముందుగా వచ్చి అధికారం లోకి వచ్చారు. కేసీఆర్ మీద నా మీద చెడు ప్రచారం చేసి పబ్బం గడుపుకున్నారు నిజం నవాబ్ కాలంలో ఖాసీం రిజ్వి లాగా పాలించారు అన్నారు. ఇప్పుడు వెలుగుమట్లను గాజాగా చేశారని దుయ్యబట్టారు. మట్టి గుట్టలు అమ్ముకున్నాడని ఎన్నో నిందలు వేశారు మరి ఇప్పటి వరకు ఏమి నిరూపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గుట్టలన్ని మాయం అయ్యాయి దానికి ఏమి సమాధానం చెపుతారు అని డిమాండ్ చేసారు. మన రాష్ట్రంలో చేసింది ఏమి లేదు కేరళ వెళ్ళి నేను మీకు అండగా ఉంటా అన్న రేవంత్ రెడ్డికి కేరళ సీఎం పినరాయి విజయన్ గట్టి బుద్ధి చెప్పారు. మన ఖమ్మం వెలుగుమట్ల ఇళ్ళు కూల్చడం దారుణం



అని విజయన్ ట్విట్టర్ లో కూడా పోస్ట్ చేశారు. 1/70 లో ఉన్న భూములు కూడా మంత్రులు ఎలా కొనుకొన్నారు. హైదరాబాద్ చుట్టూ భూములు ఆక్రమించుకుంటూ పేదలను పెద్దవారిని ఎవరిని వదలకుండా రౌడీలతో బెదిరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర ఏళు ళ అయింది వచ్చి ఒరగబెట్టింది ఏమి ప్రజలకు అర్థం అయింది..వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే..అని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు,మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ జె సి కృష్ణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, టేకులపల్లి మాజీ సొసైటీ అధ్యక్షుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కార్పొరేటర్ మక్బుల్,దండా జ్యోతిరెడ్డి, పల్లా రోజ్లీనా, కూరాకుల వలరాజు, బుర్రి వెంకటేశ్వర్లు, మాటేటి నాగేశ్వరరావు, శీలంశెట్టి వీరభద్రం, మండల అధ్యక్షుడు వీరు నాయక్, మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిన్ని కోటేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, పోట్ల శ్రీకాంత్,సిరిపురపు సుదర్శన్, ఎర్రా అప్పారావు, కోప్పర నరసింహారావు, వల్లభనేని రామారావు, నగర మైనారిటీ అధ్యక్షుడు షంసుద్దీన్, ప్రచార కార్యదర్శి షకీనా, సర్పంచ్ కొంటెముక్కల వెంకటేశ్వర్లు, పెంట్యా,మూర్తి, మాటేటి కిరణ్, ధనలక్ష్మి, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపిటిసిలు నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దళిత రత్న అవార్డు గ్రహీత కోటపాటి రుక్మారావుకు అభినందనల వెల్లువ

- **వరుస సన్మానాలతో ఘన సత్కారం**

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**

ఖమ్మం జిల్లా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం అధ్యక్షులు, రాష్ట్రస్థాయి దళిత రత్న అవార్డు గ్రహీత కోటపాటి రుక్మారావు కి అన్ని వర్గాల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సేవలకు గుర్తింపుగా వివిధ సంఘాలు, ప్రముఖులు వరుసగా సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఘనంగా సత్కరిస్తున్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ యూనియన్ కేంద్ర సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్.ఎస్.జైపాల్, ఎస్సీ స్టడీ సర్కిల్ హానరరీ డైరెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్లు రుక్మారావును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్.ఎస్. జైపాల్ మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తూ, హాస్టల్ ఫోరం ఉద్యోగ సంఘాన్ని సమర్థవంతంగా నడిపిస్తున్న రుక్మారావు అందరికీ ఆదర్శం. దళిత రత్న అవార్డు నిరంతర సేవలకు లభించిన గౌరవప్రదమైన గుర్తింపు అని అన్నారు.





భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకుని సమాజానికి విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహ సంక్షేమ అధికారులు (హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు) రుక్మారావును మర్యాద పూర్వకంగా కలిసి కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకుంటూ, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ట్రెజరర్ తిరుపతిరావు మాట్లాడుతూ, సమాజ సేవ పట్ల అంకితభావం, విద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం కృషి, ఉద్యోగ సంఘ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న రుక్మారావు సేవలు ఎంతో ప్రశంసనీయం. ఈ అవార్డు వారి కృషికి వచ్చిన న్యాయమైన గుర్తింపు మాత్రమే కాకుండా, మాకు అందరికీ ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. ఇక గురువారం మాజీ సైనిక ఉద్యోగులు కూడా రుక్మారావును ఘనంగా సన్మానించారు. ఖమ్మం నగరంలోని మమతా రోడ్డులోని ఇంటర్నేషనల్ స్పోకెన్ ఇంగ్లీష్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.ఎం.అరుణ్, ఇండియన్ వెటర్న్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతరావు శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్.ఎం.అరుణ్ మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా హాస్టల్ విద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న రుక్మారావు ఉద్యోగులందరికీ మార్గదర్శకంగా నిలుస్తున్నారు. అని ప్రశంసించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పురస్కారాలు అందుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ గా ఎన్నికైన జెడ్.ఎస్. జైపాల్ ను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, సిహెచ్.నాగమణి, బాలాజీ, వసంత, మాధురి, పులాన్ దేవి, హనుమంతరావు, బాలు, నరసింహారావు తదితరులతో పాటు డిగ్రీ లెక్చరర్ వడిగా రాజ్ కుమార్, జానపద కళాకారుడు మోదుగు గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర ప్రజా పోరాటాలకు ప్రతీక సిఆర్

• వర్ధంతి సభలో భాగం



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**
భారతదేశంలో నిరంతర ప్రజా పోరాటాలకు ప్రతీకగా సిపిఐ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) నిలిచారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. జమీందారి కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యను అభ్యసించి తుదిశ్వాస వరకు పేదల పక్షాన పోరాడిన యోధుడన్నారు. చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్ లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాల పాటు సిపిఐ జాతీయ కార్యదర్శిగా పనిచేసిన సిఆర్ చారిత్రాత్మక పోరాటాలకు నేతృత్వం వహించారన్నారు. పోరాటాల ఫలితంగా దేశ వ్యాప్తంగా లక్షల ఎకరాల భూమి పేదలకు దక్కిందన్నారు. ఇప్పుడు పాలకులు కేవలం కార్పొరేట్ల గురించి, సంపన్న వర్గాల గురించి మాత్రమే ఆలోచిస్తున్నాయని అందుకే ప్రపంచలో నాల్గవ రాజకీయ ఆర్థిక వ్యవస్థగా దేశం ఎదిగిందని చెబుతున్న దారిద్ర్య రేఖకు దిగువన బతుకుతున్న వారి సంఖ్య అదే రీతిలో పెరుగుతుందన్నారు. ఒక పక్క మతోన్మాదం, మరో పక్క పెరిగిన ఆర్థిక అసమానతలు దేశ భవిష్యత్తుకు గొడ్డలి పెట్టుగా మారాయని హేమంతరావు తెలిపారు. ప్రజల పక్షాన సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజా -సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ కార్యాచరణ ఉండాలని హేమంతరావు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు గాదె లక్ష్మి నారాయణ, శ్రీనివాస్, తాటి నిర్మల, ఇటికాల రామకృష్ణ, ఎస్కె సైదా, జ్వాలా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## చేపలసాగుపట్ల నైపుణ్యం పెంచుకోవాలి...



**పాలేరు ఆర్స్, ఏప్రిల్ 9 (తరంగాలు) :**
చేపల సాగుతో పెంపకందారులు లాభాలు గడించాలని శాస్త్రవేత్తలు సూచించారు. మత్స్య పరిశోధన స్థానం, పాలేరు, పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము హైదరాబాదు వారి ఆధ్వర్యంలో, భారతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్, వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వము న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో, తెలంగాణ మత్స్య కారులకు మత్స్య రైతులకు జరుగుతున్న "బయోఫ్లాక్ విధానంలో చేపల సాగు " అను అంశంపై మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం గురువారం విజయవంతంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం, సూర్యాపేట, వనపర్తి, జగిత్యాల జిల్లాల నుంచి 25 మంది మత్స్య రైతులు, మత్స్యకారులు హాజరైనారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బి. శ్రీనివాసరావు సూర్యాపేట జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి మాట్లాడుతూ..మత్స్య పరిశోధన స్థానం పాలేరు శాస్త్రవేత్తలు కల్పిస్తున్న బయోఫ్లాక్ ద్వారా చేపల పెంపకం అనే ఈ అధునాతన టెక్నాలజీని మన తెలంగాణ మత్స్య రైతులు, మత్స్యకారులు తప్పకుండా సద్వినియోగ పరుచుకొని అధిక సాంద్రతలో చేపలను పెంచి అధిక ఆదాయాన్ని పొందాలని కోరారు. డాక్టర్ ఎం. శ్యాం ప్రసాద్ సీనియర్ మత్స్య శాస్త్రవేత్త, అధిపతి మత్స్య పరిశోధన స్థానం పాలేరు మాట్లాడుతూ..ఈ మూడు రోజులు ఈ బయోఫ్లాక్ విధానంలో చేపల సాగు అను శిక్షణ కార్యక్రమంలో మా మత్స్య శాస్త్రవేత్తలు రైతులకు ఫ్లాక్ తయారీ, లాభనష్టాలు, ఉపయోగాలు, ఫీడింగు, నీటి నాణ్యత, వ్యాధుల గురించి సంక్షిప్తంగా వివరిస్తారని, క్షేత్రస్థాయిలో బయోఫ్లాక్ విధానాన్ని చూపిస్తారని తెలిపారు. కుమారి భానోతు దివ్య యంగ్ ప్రొఫెషనల్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా దేశవ్యాప్తంగా బయోఫ్లాక్ విధానంలో చేపల సాగు స్థితిగతుల గురించి మత్స్యకారులకు, మత్స్య రైతులకు సంక్షిప్తంగా వివరించారు. బి. రవీందర్ మత్స్య శాస్త్రవేత్త, పాలేరు మాట్లాడుతూ బయోఫ్లాక్ సాగు విధానంలో పెంచదగ్గ వివిధ రకాల సాగు చేపల గురించి సంక్షిప్తంగా వివరించారు. అదేవిధంగా పాలేరు మత్స్య పరిశోధన స్థానంలో గల చేప పిల్లల హేచరీ యూనిట్, బయోఫ్లాక్ ట్యాంక్స్, సమీకృత కోళ్లు, చేపల పెంపకం, సమీకృత గొర్రెలు, చేపల పెంపకం, సమీకృత చేపలు వరి పెంపకం వివిధ రకాల అలంకరణ చేపలు, వివిధ రకాల సాగు చేపల గురించి క్షేత్రస్థాయిలో మత్స్య రైతులకు క్లుప్తంగా వివరించారు. డాక్టర్ జి. గణేష్ మత్స్య శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు, వరంగల్ మాట్లాడుతూ..బయోఫ్లాక్ సాగు విధానములో పాటించవలసిన మేత యాజమాన్యం గురించి సంక్షిప్తంగా మత్స్య రైతులకు వివరించారు. పి. శాంతన్న మత్స్య శాస్త్రవేత్త మాట్లాడుతూ..బయో ఫ్లాక్ విధానంలో చేపల సాగు చేపట్టేటప్పుడు స్థల ఎంపిక గురించి ఫ్లాక్ తయారీ కోసం వాడే వివిధ రకాల ముడి పదార్థాలు గురించి, ఫ్లాక్ తయారీలో తీసుకోవలసిన మెలకువల గురించి, మేత పోషక విలువలు, మేత యాజమాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె. అరుణ్ కుమార్, సిగ నాగరాజు, భానోతు దివ్య (యంగ్ ప్రొఫెషనల్స్) మొదలగువారు పాల్గొన్నారు.



# ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో కొనసాగించాలి



• టీజీఓ రాష్ట్ర అధ్యక్షులుఏలూరి శ్రీనివాసరావు

తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో : ఖమ్మం : భద్రాచలంలోని ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ భద్రాచలం లో ఏప్రిల్ 13 వ తేదీన టీజీఈజేఏసీ అధ్యర్యములో 'అభ్యర్థన సదస్సు. టీజీఈజేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్, టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ భద్రాచలం దక్షిణ అయోధ్యగా పిలువబడే భద్రాచలం పుణ్యక్షేత్రం దాని పరి పరిసర ప్రాంతాల అభివృద్ధిని కాంక్షిస్తూ, గతంలో ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన ఐదు గ్రామ పంచాయతీలను పురుషోత్తపట్నం, గుండాల పిచ్చికలపాడు, ఎటపాక, కన్నాయిగూడెం పిచ్చికలపాడు తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని టీజీఈ జేఏసీ (టీ జీ ఈ జె ఏ సి) కోరుతున్నది. ఈ నేపథ్యంలో, ఈ నెల 13వ తేదీ, సోమవారం (ఏకాదశి) నాడు భద్రాచలంలోని పాత ఆర్ అండ్ బి (ఆర్ అండ్ బి) బిల్డింగ్ మైదానంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు భారీ అభ్యర్థన సదస్సు అన్ని ఉద్యోగ సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, మేధావులచే నిర్వహించబడుతుంది. ప్రస్తుతం ఈ ఐదు పంచాయతీల ప్రజలు వైద్య, రెవెన్యూ ఇతర ప్రభుత్వ సేవల కోసం వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. భద్రాచలం పట్టణానికి ఆనుకుని ఉన్న ఈ గ్రామాలు విలీనమైతేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని తెలియజేశారు. ఈ సదస్సుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మంత్రులు (తుమ్మల నాగేశ్వరరావు , పొంగులేటి శ్రీనివాసరెడ్డి , భట్టి విక్రమార్క, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నారని, ఉద్యమంలో జర్నలిస్టులు, ఉద్యోగులు ఏ విధంగా పోరాడారో, అదే స్ఫూర్తితో ఈ విలీనం కోసం కూడా పోరాడాలని ఇది కేవలం రాజకీయ అంశం కాదు, భద్రాద్రి రామయ్య భూములను కాపాడుకోవడం మరియు స్థానిక ప్రజల సౌకర్యం కోసం చేస్తున్న సామాజిక బాధ్యత అని, కేంద్ర ప్రభుత్వం మరియు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సానుకూలంగా స్పందించి, శాస్త్రీయంగా ఈ ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. యావత్తు ఖమ్మం జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు అందరూ ప్రజా ప్రతినిధులని ప్రజలని ప్రజా సంఘాలని ఉద్యమ సంఘాలని విద్యార్థి సంఘాలని జర్నలిస్టుల్ని ప్రొఫెషనల్స్ అందరిని కూడా మేము ఉద్యోగ సంఘాలుగా సమన్వయం చేయడానికి ఒక దండకి దారం ఎలా ఉంటుందో అలా పని చేసేవాళ్ళమే. మీరు ముందు ఉండి నడిపియాలి ఈ ఐదు పంచాయతీలు కూడా వస్తేనే సంపూర్ణమైన ఉమ్మడి ఖమ్మం జిల్లా భద్రాద్రి రాము రామాలయం డెవలప్ కావాలన్నా తెలంగాణ భవిష్యత్తు తూర్పు దిశగా పెరగాలన్న ఈ ఐదు గ్రామ పంచాయతీల కీలకం. ఈ ఐదు గ్రామ పంచాయతీలు కూడా సరైన రహదారులు గాని విద్యా వైద్య సౌకర్యాలు గాని ఇవన్నీ ఇబ్బందులు ఉన్నాయి వీటి పరిష్కారానికి ఈ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలన్నారు. ఈ అభ్యర్థన సదస్సును విజయవంతం చేయవలసిందిగా అఖిల పక్ష నాయకులను, విద్యార్థి, ఉద్యోగ, ప్రజా సంఘాలను మరియు జర్నలిస్టు మిత్రులను ఉమ్మడి ఖమ్మం జిల్లా టీజీఈజేఏసీ సాదరంగా ఆహ్వానిస్తోందని తెలియజేశారు

అనంతరం ఈ కార్యక్రమంలో భద్రాద్రి పునరేగీకరణ విస్తృతస్థాయి అఖిలపక్ష సమావేశ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీఈజెఏసి ఖమ్మం జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, టీజీవో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, టిఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్, రెవిన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తుంబూరు సునీల్ రెడ్డి, టీజీవో అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావు పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సుబ్బయ్య,హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వీరాస్వామి, టీపీటీఫ్ కార్యదర్శి వెంగలరావు,యుటిఎఫ్ అధ్యక్షలు రంజాన్ , టిఆర్టియు అధ్యక్ష కార్యదర్శులు శేఖర్, ఫోర్త్ క్లాస్ అసోసియేషన్ బాధ్యులు బిక్కు, వెంకటరమణ, హౌస్ బిల్లింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ విజయకుమార్, మున్సిపల్ అసోసియేషన్ సుధాకర్ బుర్రి వెంకటేశ్వర్లు, హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వీరస్వామి, హెచ్ డబ్ల్యు ఎస్ అధ్యక్షులు రుక్మారావు, జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ కొప్పిశెట్టి సురేష్, పెన్షనర్స్ అసోసియేషన్ వేణు, ఔట్సోర్సింగ్ అసోసియేషన్ బుర్రి వినోద్ కుమార్, మార్కెటింగ్ అసోసియేషన్ ఆంజనేయులు, మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అస్లాం, సయ్యద్ జిలాని, టీజీవో నాయకులు సూరంపల్లి రాంబాబు, తాజుద్దీన్, గోపాలకృష్ణ కృష్ణార్జున తిరుపతిరావు, టీఎన్జీఓస్ మహిళా విభాగం చైర్ పర్సన్ మృదుల, నాయకులు తాళ్లూరి శ్రీకాంత్, ఎర్రమళ్ళ శ్రీనివాసరావు,కోణార్, విక్కిర్యాల శ్రీనివాస్, జెడ్ ఎస్ జైపాల్ మల్లోజు వెంకన్న , పొట్ట పెంజర రామయ్య, కెవి రమణ రవికుమార్ తాళ్లూరు చంద్రశేఖర్, గుడిపూడి శ్రీనివాస్, ఎంవీ వీరయ్య, దుర్గాప్రసాద్, రమణ యాదవ్, ఎర్రమల శ్రీనివాస్ చంద్రశేఖర్ గౌడ్, గజ్జల మృదుల ఎర్ర రమేష్, అజ్మత్ బెగ్, గఫూర్, లింగం సురేష్ , టీజీవో,టీఎన్జీవో, ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్స్, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్, ఉద్యోగులు సకల ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి

• జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ స్నేహ శబరీష్.

**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఏప్రిల్. 09, తరంగాలు:**
గురువారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్, పంచాయతీ అధికారులతో కలిసి జిల్లాలో తాగునీటి సరఫరాపై సమీక్షించారు.జిల్లా వ్యాప్తంగా వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు.ఫిబ్రవరి 1 నుండి స్పెషల్ డ్రైవ్ చేసిన దానిలో సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. నీటి సరఫరా సమస్య ఉన్న గ్రామాలను ముందస్తుగా గుర్తించి ప్రణాళిక బద్ధంగా మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలని ఆదేశించారు. అలాగే గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాలలో సమస్య పునరావృతం కాకుండా చూడాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాలలో, హ్యాబిటేషన్ లలో సరఫరా చేసేటువంటి నీరు నాణ్యతను పరిశీలించాలని అన్నారు.యాక్షన్ ప్లాన్ తయారు చేసి, గ్రామాల వారీగా ఏప్రిల్ 23 తరువాత ప్రతి పాఠశాలలోని నీటి ట్యాంకులను శుభ్రపరచాలని అన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో పైప్ లైన్ లీకేజీ ఏమన్నా ఉంటే వాటిని సరి చేయాలని అన్నారు.





**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జిల్లాలో 4205 ఇందిరమ్మ ఇండ్లకు గాను సుమారు 795 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, గ్రామాలలో, మున్సిపల్ ప్రాంతాల్లో పూర్తి కాని ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.అధికారులు క్షేత్రస్థాయిలో ఫీల్డ్ విసిట్ చేసి లబ్ధిదారులతో మాట్లాడాలని మార్కింగ్, బేస్ మెంట్ లెవల్, స్లాబ్ లెవల్ నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయించాలని, ఎవరైతే ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ అయి నిర్మాణానికి ఆసక్తి లేని వారి పేర్లలో వేరే లబ్ధిదారులను చేర్చే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఏ గ్రామంలోనైతే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొరకు లబ్ధిదారుల ఎంపికకు ఆ గ్రామ కమిటీ ఆసక్తి గా లేకపోతే కొత్త కమిటీ ప్రతిపాదనలకు చర్యలు తీసుకోవాలని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వద్ద ఉద్యోగులు ఏ విషయంలో నైనా డబ్బులు వసూళ్లకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే క్షమించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా అధికారులు కృష్ణారెడ్డి,, ఎం.పి.డి.ఓ లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సర్పంచ్ ప్రశంస




**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్. 0 9, తరంగాలు:**
కేసముద్రం మండలం కొత్తూరు గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఆరో రోజున భాగంగా వాలంటీర్లు ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టారు.గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ వివరాలు, వృత్తి సమాచారం, ఆరోగ్య సమస్యలు, వసతి గృహ పరిస్థితులు, పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రభుత్వం నుండి లబ్ధి పొందిన వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సారంపల్లి దేవేంద్ర మోహన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఈ సర్వే నిర్వహించడం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. సేకరించిన వివరాలు గ్రామాభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు దోహదపడతాయని పేర్కొన్నారు. వాలంటీర్ల సేవలను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. గూగులోతు రమేష్ నాయక్, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

•హాజరుకానున్న మంత్రి పొంగులేటి



**పాలేరు ఆర్సీ, ఏప్రిల్ 9 (తరంగాలు) :** కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేడు (శుక్రవారం) సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయం ఇన్ చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. లబ్ధిదారుల జాబితా ఇప్పటికే గ్రామాలవారీగా పంపించడం జరిగిందని తెలిపారు. గ్రామాలలో నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారుల ఆధార్ కార్డు తమవెంట తీసుకుని వచ్చేలా సూచనచేసి తీసుకునిరావాలని కోరారు. కావున చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు, ఉప సర్పంచ్ లు, మాజీ ఎంపీపీలు, జడ్పిటిసిలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, లబ్ధిదారులు, సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## సబ్ జైలర్ ను పరామర్శించిన డిసిసిబి మల్లిబాబు యాదవ్



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన ఖమ్మం జిల్లా కేంద్ర కారాగారం సబ్ జైలర్ గుండ్ల బాలరాజు మాతృ మూర్తి గుండ్ల దుర్గమ్మ ఇటీవల అనారోగ్యం తో మరణించారు. గురువారం నాడు జరిగిన వారి దశదిన కర్మ కార్యక్రమం లో కామేపల్లి మాజీ జడ్పీటీసీ, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ పాల్గొని దుర్గమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు కోరుకున్నారు.కుమారుడు బాలరాజును వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ ప్రపంచం లో ప్రతి ఒక్క రికి తల్లి లేని లోటు తీర్చలేనిదని,కాల గమనం లో ఎవరికైనా తప్పదని పేర్కొన్నారు. వారి కుటుంబానికి ఎలాంటి సహాయ సహకారం కావాలన్న అందిస్తానని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమం లో గుండ్ల శ్రీను, చీమ కవిత గుండ్ల ప్రకాశం దాసరి సీతారాములు ఆదూరి ఆనందరావు, గుండ్ల కృష్ణ, గొల్లపల్లి కృష్ణయ్య తేలూరి ఉప్పలయ్య, గుండ్ల వెంకటరత్నం గొల్లపల్లి బిక్షమయ్య, ఇనప నాగేశ్వరరావు తేలూరి వీరభద్ర, నీరుడు బిక్షం, గుండ్ల రమేష్ గుండ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసిన అంబటి మహేందర్ రెడ్డి



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్. 0 9, తరంగాలు:** మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన పంచాయతీరాజ్ శాఖ మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అలాగే మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ లను మహబూబాబాద్ జిల్లా అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి మ ర్యా ద పూ ర్వ కం గా కలిశారు.మహబూబాబాద్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినందుకు మంత్రి సీతక్కకు, ఎమ్మెల్యే మురళి నాయక్ లను శాలువాతో మహేందర్ రెడ్డి సన్మానించి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ నాకు ఇచ్చిన బాధ్యతను పూర్తిస్థాయిలో పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తానని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ బండారు వెంకన్న, కేసముద్రం మున్సిపాలిటీ కౌన్సిలర్ తరాల వీరేష్, ఇనుగుర్తి మండల పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్, మాజీ ఎంపీపీ కదిరే సురేందర్, పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థిని ఎంపిక

**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 9,( తరంగాలు):** ఇల్లందు మండలంలోని సుదిమళ్ళ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలోని, తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని జి.హర్షిత జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక అయ్యారు. జనవరి 23న మహబూబాబాద్ లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్.జి. ఎఫ్ యు /14 రగ్బీ క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ఈ నెల 9, 10 న ఒరిస్సాలో జరుగునున్న జాతీయ స్థాయి పోటీలకు వెళ్లనున్నారు. ఇందుకు గాను ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ బి.అరుణ కుమారి పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు హర్షిత ను అభినందించారు.



# వయోవృద్ధులు, స్త్రీ, శిశు, మాత సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

### క్షేత్రస్థాయిలో అంగన్వాడి సేవల బలోపేతానికి మొబైల్ ఫోన్లో పంపిణీ

రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క).

మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, ఏప్రిల్. 09, తరంగాలు:గురువారం మహబూబాబాద్ పట్టణంలో వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభించి, అంగన్వాడి టీచర్లకు (1313) మొబైల్ ఫోన్లు పంపిణీ, పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు డాక్టర్ భూక్య మురళి నాయక్, కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, మున్సిపల్ చైర్పర్సన్ జ్యోతి లతో కలిసి ప్రారంభించిన, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క,గురువారం మహబూబాబాద్ పట్టణంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను ప్రారంభించారు, వృద్ధుల సంరక్షకులకు జీవనశైలి మెరుగుపడడం కోసం ఉపయోగపడుతుందని వారి యొక్క ఒంటరితనాన్ని పోయి సంతోషంగా ఉండటం కోసం రూపొందించబడిన




ఈ కేంద్రం ద్వారా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలోని వయోవృద్ధులు వివిధ క్రీడలలో పాల్గొనవచ్చని, తద్వారా మానసిక ప్రశాంతతబి ఉల్లాసంగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, జిల్లాలో సుమారు 12 లక్షల వ్యయంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ కేంద్రం నిర్వహించడం జరుగుతుందన్నారు,వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పిల్లలు ప్రేమగా చూసుకోవాలని, వారిని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో వదిలేయడం తగదని సూచించారు. ప్రభుత్వం వృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కేంద్రంలో టీవీ, దినపత్రికలు మ్యాగజీన్, పాటల పోటీలో క్యారమ్స్, చెస్, మొదలగైన ఆటలు అందుబాటులో ఉంటాయని, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో కేంద్రంలో ప్రథమ చికిత్స ఆరోగ్య సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందని, ప్రతి వారానికి ఒకసారి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్య స్థితిగతులను గమనిస్తూ ఉంటారని, వారి యొక్క ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మల్టీ గ్రైన్ ఆల్ఫా ఆహార పదార్థాలతో అందించడం జరుగుతుందని తెలిపారు,స్త్రీ, శిశు సంక్షేమ శాఖ బలోపేతం కోసం రాష్ట్రవ్యాప్తంగా వయవృద్ధులు గర్భిణీలు బాలింతలు చిన్నపిల్లలకు వివిధ పథకాలను ప్రవేశపెట్టి వారి సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని అందులో భాగంగానే జిల్లాలోని అంగన్వాడీ టీచర్లకు (1368) మొబైల్ ఫోన్ల పంపిణీ చేయడం జరిగిందని తద్వారా క్షేత్రస్థాయిలో డిజిటల్ విధానంలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే పథకాలు పౌష్టిక ఆహారం, స్థితిగతులు ఎప్పటికప్పుడు ఆన్లైన్ ద్వారా అప్లోడ్ చేయడం పారదర్శకంగా పాలన కొనసాగుతుందన్నారు.పోషణ్ పఖ్వాడా కార్యక్రమాన్ని మహబూబాబాద్ కేంద్రంగా గురువారం నుండి ప్రారంభించారు, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే పౌష్టికాహార పంపిణీపై కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలు, ఆహార పంపిణీ అంశాలను నమోదు చేయవచ్చని, దీని ద్వారా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం పోషణ్ పఖ్వాడా కార్యక్రమం లక్ష్యమని, ఈ కార్యక్రమం ఈ నెల 9 నుంచి 23 వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగుతుందని మంత్రి పేర్కొన్నారు.మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం చరిత్రత్మకమైన నిర్ణయం తీసుకొని శాసనసభలో వృద్ధుల సంక్షేమ చట్టం ప్రవేశపెట్టి అమలుపరచినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు,మహబూబాబాద్ లో డే కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని, రిటైర్డ్ ఉద్యోగులు వయవృద్ధుల కోసం ఇక్కడ వెల్నెస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని మంత్రి గారిని కోరారు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, సభను ఉద్దేశించి ప్రసంగించి అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో జిల్లా యంత్రాంగం ప్రజా ప్రతినిధులు ముందుకు సాగుతారని అన్నారు,ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ కె. అనిల్ కుమార్, జిల్లా వెల్ఫేర్ అధికారిని సబిత, సిడిపిఓలు శిరీష, సంబంధిత విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి సమాచారం తెలిపిన వారికి బహుమతి

•సమాచారం ఇవ్వాల్సిన మొబైల్ నెంబర్:8712656999:ఎస్పీ డా. శబరీష్, ఐ.పి.ఎస్.



**మహ బూబాబాద్ జిల్లా,ప్రతినిధి ,ఏప్రిల్. 09,తరంగాలు :** మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ యువత ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తును కాపాడటానికి గంజాయి వినియోగం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడానికి కట్టుబడి ఉంది. డ్రగ్స్ దుర్వినియోగం ఒక తీవ్రమైన సామాజిక సమస్య. ఇది నిశ్శబ్దంగా యువత జీవితాలను నాశనం చేస్తూ కుటుంబాలను బలహీనపరుస్తుంది. వ్యక్తులను నేరాల వైపు నడిపిస్తుంది. జిల్లా ప్రజలకు సురక్షితమైన, డ్రగ్స్ రహిత వాతావరణాన్ని కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యాలలో ఒకటి.గంజాయి లాంటి మహమ్మారి నుండి మన ఉరిని, యువత భవిష్యత్తుని కాపాడేందుకు గంజాయి వినియోగం లాంటి కార్యకలాపాలను గుర్తించి పూర్తిగా అరికట్టడానికి ప్రజల సహకారం ఎంతో అవసరం. బాధ్యత గల పౌరులు, యువజన నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు సమాజాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషించగలరు.మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ప్రజలందరినీ గంజాయి వినియోగదారులు లేదా సరఫరా చేసే వ్యక్తుల గురించి విశ్వసనీయ సమాచారం అందించాలని కోరుతోంది. పోలీసులకు చర్యలు తీసుకునేందుకు ఉపయోగపడే సమాచారాన్ని అందించిన వారికి ?5,000 వరకు బహుమతి ఇవ్వబడుతుంది. సమాచారం ఇచ్చే వ్యక్తి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. సమాచారం ఈ ఫోన్ నెంబర్ 8712656999 తెలుపగలరు.

## ఈశ్వర్ మరణం కలచివేసింది

•బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి




పాలేరు ఆర్సీ, ఏప్రిల్ 9 (తరంగాలు) : కూసుమంచి మండలకేంద్రంలో హఠాన్మరణం చెందిన యువకుడు గోపే ఈశ్వర్ మరణం కలిచివేసిందని బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఈశ్వర్ చిత్ర పటానికి పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటాడని కలలు కన్న ఆ కుటుంబానికి తీరని మనోవేదన మిగిలిందని, ఈశ్వర్ ఆత్మకు శాంతి చేకూరాలని, భగవంతుడు ఆ కుటుంబానికి మనోధైర్యం అందించాలని కోరినట్లు ఆయన తెలిపారు. చేతికందిన కొడుకు మరణించడంతో ఆ కుటుంబసభ్యులవేదన వర్ణణాతీతంగా మారిందన్నారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి అని కోరారు. కార్యక్రమంలో మంద చంద్రశేఖర్ గౌడ్, నరేష్, అఖిల్, గురువయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 9,( తరంగాలు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు, ఇల్లందు డిఎస్పి యు. వెంకన్న బాబు, సీఐ సురేష్ ల సూచనల మేరకు ఈరోజు ఉదయం చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి అనే కార్యక్రమంలో. ఎస్సై సారంగపాణి ఇల్లందు పట్టణంలోని లేబర్ అడ్డా వద్ద పోలీసుల ఆధ్వర్యంలో. మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై సారంగపాణి మాట్లాడుతూ, యువత గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. భవిష్యత్తుపై లక్ష్యంతో సామాజిక సేవ వైపు సాగాలని కోరారు. ఈ కార్య క్రమంలో పోలీస్ సిబ్బంది రత్నం, చారి, రమేశ్ తదితరులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.



జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
శుక్రవారం, 10 ఏప్రిల్, 2026
GENERAL NEWS


## ఎస్సి కార్పొరేషన్ ద్వారా పాడి గేదెల పథకానికి ఆన్ లైన్ దరఖాస్తు గడువు పొడిగింపు



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఏప్రిల్. 09, తరంగాలు**:జిల్లా షెడ్యూల్డ్ కులల సేవా సహకార అభివృద్ధి సంఘం లి,,మహబూబాబాద్ జిల్లా ద్వారా 2025-26 సం. నకు పాడి గేదెల పథకానికి గాను ఆన్ లైన్ దరఖాస్తు తేది 08-04-2026 ముగియడంతో ప్రభుత్వం గడువు తేదిని 16-04-2026 వరకు పొడిగించనైనదని కార్యనిర్వాహక సంచాలకులు కె. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.కావున, అర్హులైన షెడ్యూల్డ్ కులములకు చెందిన యువతీ / యువకులు సంబందిత కుల ధృవీకరణ పత్రం (తెలంగాణా ఏర్పడిన తరవాత జారీ చేసింది), ఆదాయ ధృవీకరణ ప(తం (మీసేవ ద్వారా జారీ చేసింది), ఆదార్ కార్డు, రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు, పాస్ పోర్ట్ సైజు పోటో, సదరం సర్టిఫికేట్ (వికలాంగుల కోసం) మరియు పట్టాదారు పాసు పుస్తకం (కనీసం 0.10 గుంటలు), తదితర ధృవ ప(తాలతో 16-04-2026 వరకు ఆన్ లైన్ (ఒఒఫ్.స్త్రశీఎఎం.ఎస్త్ర.స్త్రశీజ.ఱఅ) నందు దరఖాస్తు చేసుకొని, వెంటనే అట్టి ఆన్లైన్ దరఖాస్తుకు సంబందిత ధృవ పత్రాలను జత పరిచి (హార్డ్ కాపీ), గ్రామీణ ప్రాంతం వారు సంబందిత ఎంపీడీవో కార్యాలయము నందు మరియు పట్టణ ప్రాంతం వారు సంబందిత మునిసిపాలిటి కార్యాలయము నందు సమర్పించవలసినదిగా తెలియపరచనైనది.ఈ పథకం ద్వారా అర్హులైన లబ్దిదారులకు (02) పాడి గేదెలను అందజేయడం జరుగుతుందని,ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోగలరని ఈ సందర్భంగా అధికారి పేర్కొన్నారు.

## రోజుకు రూ.300 పొదుపు చేస్తే 10 ఏళ్లలో రూ.15 లక్షల ఫండ్

న్యూఢిల్లీ, 9 ఏప్రిల్ 2026 (తరంగాలు ప్రతినిధి):

ప్రతి వ్యక్తి తాను కష్టపడి సంపాదించిన డబ్బులో కొంత మొత్తాన్ని భవిష్యత్తు కోసం పొదుపు చేస్తాడు. అయితే, ఈ ద్రవ్యోల్బణ కాలంలో కేవలం డబ్బు ఆదా చేయడం మాత్రమే సరిపోదు. దానిని సరైన, సురక్షితమైన చోట పెట్టుబడి పెట్టడం కూడా అంతే ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

సామాన్యుల కోసం పోస్ట్ ఆఫీస్ అందిస్తున్న అద్భుతమైన పథకాల్లో ఒకటి పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్ (ఆర్ డి ). ప్రభుత్వ గ్యారెంటీ ఉండటంతో ఇందులో రిస్క్ సున్నా, లాభం ధీమాగా ఉంటుంది. ఈ స్కీమ్ ద్వారా చిన్న పొదుపులు కొన్ని ఏళ్లలో భారీ నిధిగా మారవచ్చును.ఈ పథకంలో ఖాతాను నెలకు కేవలం రూ.100తో ప్రారంభించవచ్చు. 18 ఏళ్లు నిండిన ఏ భారతీయ పౌరుడైనా ఈ ఖాతాను తెరవవచ్చు. ప్రస్తుతం ఈ పథకంపై ప్రభుత్వం 6.7 శాతం వార్షిక వడ్డీని అందిస్తోంది. సాధారణంగా ఆర్ డి మెచ్యూరిటీ కాలం 5 ఏళ్లు ఉంటుందో, అవసరమైతే మరో 5 ఏళ్లు పొడిగించవచ్చు. ఖాతా తెరిచిన ఏడాది తర్వాత డిపాజిట్ మొత్తంలో 50 శాతం వరకు తక్కువ వడ్డీతో లోన్ పొందవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో 3 ఏళ్ల తర్వాత ఖాతాను మూసివేయవచ్చు. ఖాతాదారుడు మరణిస్తే నామినీ ఆ ఖాతాను కొనసాగించవచ్చు లేదా డబ్బును విత్డ్రా చేసుకోవచ్చు.మీరు ప్రతిరోజూ రూ.300 పొదుపు చేస్తే అది నెలకు రూ.9,000 అవుతుంది. ఈ మొత్తాన్ని ఆర్ డి లో ఇన్వెస్ట్ చేస్తే 5 ఏళ్ల తర్వాత అసలు జమ రూ.5.40 లక్షలు, వడ్డీతో కలిపి సుమారు రూ.6.4 లక్షలు అవుతుంది. 10 ఏళ్ల తర్వాత మీరు జమ చేసే మొత్తం రూ.10.8 లక్షలు, వడ్డీ కేవలం రూ.4.40 లక్షలు, మెచ్యూరిటీ సమయానికి మొత్తం రూ.15.20 లక్షలు చేరుతుంది.

గమనికగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వడ్డీ రేట్లు త్రైమాసికానికి ఒకసారి మారవచ్చు. పెట్టుబడి చేసేముందు సమీప పోస్ట్ ఆఫీస్‌లో తాజా వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



## పలు శుభకార్యాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్,మున్సిపల్ వైస్ చైర్ పర్సన్



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, ఏప్రిల్. 0 9, తరంగాలు**:కేసముద్రం మున్సిపాలిటీ 2వ వార్డు రేకుల తండాకి చెందిన బానోత్ కిషన్ - వినోద కుమార్తె అర్చన - యాకుబ్ వివాహ వేడుకల్లో కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత, వైస్ చైర్ పర్సన్ అల్లం రమ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.కేసముద్రం మున్సిపాలిటీ 3వార్డ్ దన్నసరి గ్రామానికి చెందిన తండా ఐలయ్య యాదవ్-రజిత కుమారుడు రంజిత్ కుమార్-స్రవంతి రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 3 వార్డు కౌన్సిలర్ ధారావత్ కిషోర్,12వార్డు కౌన్సిలర్ తరాల వీరేష్ యాదవ్,యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లం గణేష్ యాదవ్,దన్నసరి గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండ సురేష్, ఎండి సమీర్,కాట్రేవుల హరి కృష్ణ,బానోత్ రాజేందర్,శోభన్,మహేష్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత

## కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాస్

పరకాల, ఏప్రిల్ 9,తరంగాలు :కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తుందని 19వ వార్డు కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల పట్టణంలోని 19 వ వార్డులో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం మందులు పంపిణీ చేశారు. అనంతరం కొయ్యడ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ పథకం 5 లక్షల నుండి 10 లక్షల వరకు పెంచిందన్నారు. ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ వైద్యం అందించేందుకు కృషి చేస్తుందని,ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ స్వాతి, డాక్టర్ వంశీ రెడ్డి, డాక్టర్ జ్యోతి రాజకుమార్, ఏ ఎన్ ఎం ఎస్ రజిత, భాగ్యలక్ష్మి కల్పన భాగ్యలక్ష్మి ఆశ వర్కర్లు సౌందర్య, సుభద్ర, అంగన్వాడీ టీచర్లు విజయ, మల్లికాంబ, దుప్పటి రాజేష్, ఎండి షఫీ, వెల్తురు చిన్ని, నజీర్, రాహుల్, సురేష్, సాయి, సన్నీ



తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు మండల సర్పంచుల సంఘం ఏర్పాటు

•సర్పంచుల సంఘం అధ్యక్షురాలిగా పాయం స్వాతి ని సన్మానించిన ఎమ్మెల్యే



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 9,( తరంగాలు)**: ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో సర్పంచ్ ల సంఘం ఏర్పాటు చేయడం జరిగింది. అధ్యక్షురాలిగా పాయం స్వాతి ఎన్నిక కాగా ఆమెను శాలవాతో సత్కరించారు. ఉపాధ్యక్షులుగా గుగులోత్ నాగార్జున్,సెక్రటరీ గా జరుపుల లక్ష్మణ్, కోశాధికారి గా ఈసం బాలకృష్ణ, సహాయ కార్యదర్శిగా ఈసాల సురేష్,గౌరవ సలహాదారులుగా వళ్ళాలా మంగమ్మ ను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సర్పంచ్ లందరూ గ్రామపంచాయతీ ల అభివృద్ధి కి పాటుపడాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్నుకోబడిన సభ్యులతో పాటు పాల్గొన్న సర్పంచులు పాయం లలిత, కుంజా సుగుణయ్య, చందావత్ రమేష్ ,అజ్మీరా బిచ్చు, జరుపుల అంజలి, మోకాళ్ళ లావణ్య, అరెం ప్రియాంక, కోటి,బానోత్ శంకర్, ఎపి, సనప సావిత్రి, తాటి యశోద, జరుపుల లక్ష్మణ్, రమణ ఎట్టి, పూనెం స్వర్ణలత, ముక్తి రమేష్, సరస్వతి,మూడ్ విజయకుమారి, గోగ్గల సరోజ, దారావత్, భారతి వాంకుడోత్, సాయమ్మ మచ్చ, బానోతు శారదా, అనూష భూక్యా, ధనసరి స్రవంతి,కిషోర్ బోడ,మండల నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, వైస్ ఎంపీపీ మండల రాము,మాజీ సర్పంచ్ తాటి బిక్షం మూతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## పి.ఆర్.సి పెండింగ్‌లో ఉన్న డి.ఏలు వెంటనే ప్రకటించాలి



తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ డిమాండ్

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉద్యోగ విరమణ చేసిన రోజే చెల్లించాలి.
- హెల్త్ కార్డుల మంజూరీ ప్రక్రియ వేగవంతం చేయాలి.
- సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి.



కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఏప్రిల్.09,తరంగాలు:ఉద్యోగ,ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న అన్ని డి. ఏ లను ప్రకటించాలని, మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న పీఆర్సీని వెంటనే అమలుచేయాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం కేసముద్రం స్టేషన్ ఉన్నత పాఠశాలలోటిపిటిఎఫ్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ మాట్లాడుతూ మారుతున్న జీవన ప్రమాణాలను, ధరలను,అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒక డీ.ఏ ను, ఐదు సంవత్సరాలకు ఒకసారి పి ఆర్ సి ని ప్రకటిస్తుందని కానీ ఆర్థిక మాంద్యాన్ని సాకుగా చూపించి ఏళ్లు గడిచినా పి.ఆర్.సి మరియు డి.ఏ లను ఇంకా ఆలస్యం చేస్తూ ఉద్యోగ ఉపాధ్యాయులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆయన విమర్శించారు. ఇది సరైన పద్ధతి కాదని, తక్షణమే వీటి అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయులు 30 -35 సంవత్సరాలు విద్యార్థులకు సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులకు రిటైర్ అయిన రోజే గ్రాట్యుటీ, పీఎఫ్, పెన్షన్ మొదలైన అన్ని రిటైర్మెంట్ బెనిఫిట్స్ పూర్తిగా చెల్లించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని, పెండింగ్ అన్ని రకాల బెనిఫిట్స్ ని తక్షణమే మంజూరు చేయాలనికోరారు.ఉపాధ్యాయుల ఆరోగ్య భద్రత కోసం ఇటీవలే ప్రభుత్వం ప్రారంభించిన హెల్త్ కార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలని, వాటి వినియోగంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని, ఏ కార్పొరేట్ ఆస్పత్రిలో అయినా అన్ని రకాల నగదు రహిత వైద్యం అందేలా రూపొందించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ భద్రత, జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్న , వారి జీవితాలను అగమ్యగోచరం చేస్తున్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి వారి కుటుంబాలలో వెలుగులు నింపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి నరసింహ రాజు, జిల్లా కార్యదర్శి చీకటి వెంకట్రాం నర్సయ్య, ఉపాధ్యక్షులు కొమ్ము రాజేందర్, అంజన్న,కార్యదర్శులు ఊట్కూరు ప్రణయ్ కుమార్, వీసం నర్సయ్య, మోహనకృష్ణ,, బొల్లెద్దు చందర్ , ఆడిట్ కమిటీ కన్వీనర్ బి శ్రీనివాస్ అక్కడ మీకు సెల్ కన్వీనర్ జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
శుక్రవారం, 10 ఏప్రిల్, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## సోలార్ ఫ్యాక్టరీ పనులను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య



**జఫర్గడ్ ప్రతినిధి, ఏప్రిల్ 9,(తరంగాలు):** మండలంలోని రఘునాథపల్లి గ్రామంలో మోతే దేవి జయపాల్ రెడ్డి భూమిలో సోలార్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ పనులను ప్రారంభించిన సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీదేవి పెద్దిరెడ్డి,ఉప సర్పంచ్ మర్రి సుధీర్ రెడ్డి, కంపెనీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టాలు కలిగిన ఆదివాసి కుటుంబాలకు న్యాయం చేయాలి

- **ఆదివాసి సంఘాల నేతలు**



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 9, ( తరంగాలు):** ఇల్లందు మండలం పూసపెల్లి ఓసి నిర్వాసిత ప్రాంతంలో, పట్టాలు కలిగిన ఆదివాసి కుటుంబాలకు సింగరేణి యాజమాన్యం న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో పూసపెల్లి ఓసిలో భూములు కోల్పోతున్న ఆదివాసీలు ఢిల్లీ ఎస్టీ కమిషన్ కి ఫిర్యాదు చెయ్యగా నోటీస్ పంపించటం జరిగిందని తెలిపారు.

## దశదిన కార్యక్రమంలో పాల్గొన్న మల్లి బాబు యాదవ్



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 9,( తరంగాలు):** వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు సోదరుడు బోళ్ల రామారావు హృదయ సంబంధ వ్యాధితో ఇటీవల మరణించడం జరిగింది. సోమవారం జరిగిన వారి దశదిన కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, రాష్ట్ర టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు,టీపీసీసీ మెంబర్ పుచ్చకాయల వీరభద్రం, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ పాల్గొని రామారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించినట్లు తెలిపారు. వారి కుటుంబాన్ని పరామర్శించి రామారావు చాలా సౌమ్యులని, వారి మరణం కుటుంబానికి ముఖ్యంగా గంగారావు కి సోదరుని మరణం తీరని లోటు అని, ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అఖిల భారత యాదవ మహాసభ అండగా ఉంటుందని మల్లి బాబు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటిపూడి గ్రామ సర్పంచ్ జువ్వాజి అశ్విని, నాగరాజు యాదవ్,సప్పిడి వెంకటేశ్వర్లు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా అటవీ శాఖ వారి వనజీవి రామయ్య చిత్ర బృందానికి ఘనంగా సన్మానం



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** ఖమ్మం: జిల్లా అటవీ శాఖాధికారి (డి ఎఫ్ ఓ) సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఐ ఎఫ్ ఎస్ నేతృత్వంలో, వాసవిక్ సేవా ఫౌండేషన్ సహకారంతో వనజీవి రామయ్య చిత్ర బృందాన్ని గౌరవిస్తూ ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాద్రి సర్కిల్ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (సి సి ఎఫ్) డాక్టర్ డి. భీమా నాయక్, ఐ ఎఫ్ ఎస్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య తన జీవితాన్ని నిస్వార్థంగా ప్రకృతి రక్షణకు అంకితం చేశారని, ఇది ఖమ్మం జిల్లాకే కాక తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని కొనియాడారు. పర్యావరణ ప్రస్థానంలో కుటుంబ సభ్యుల సహకారం అభినందనీయమన్నారు. ముఖ్యంగా తాను పెంచిన విలువైన ఎర్రచందనం చెట్లను ప్రభుత్వానికి అప్పగించడం ద్వారా రామయ్య తన ప్రజా శ్రేయస్సు పట్ల ఉన్న నిబద్ధతను చాటుకున్నారని గుర్తుచేశారు. అతిథిగా విచ్చేసిన మున్సిపల్ మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ, రామయ్య విజయంలో భార్య జానకమ్మ కృషి మరువలేనిదని అన్నారు. జానకమ్మ కి పెన్షన్ సౌకర్యం కల్పించే విషయంపై జిల్లా కలెక్టర్‌తో చర్చిస్తానని ఆమె హామీ ఇచ్చారు. మరో అతిథి, అదనపు కలెక్టర్ శ్రీ పిన్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రామయ్య జీవిత కథను స్ఫూర్తిదాయకమైన సందేశాత్మక చిత్రంగా మలుస్తున్న చిత్ర బృందాన్ని అభినందించారు.?ఖమ్మం జిల్లా అటవీ శాఖాధికారి శ్రీ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఐ ఎఫ్ ఎస్ మాట్లాడుతూ, గత ఆరు నెలలుగా ఖమ్మంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్ మరియు వికారాబాద్ అటవీ ప్రాంతాల్లో షూటింగ్ కోసం అటవీ శాఖ తరపున పూర్తి సహకారం అందించామని తెలిపారు. ప్రస్తుత భవిష్యత్ తరాలు రామయ్య జీవితం నుండి స్ఫూర్తి పొంది మొక్కలు నాటడం, వన్యప్రాణులను రక్షించడాన్ని బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సినిమా ముహూర్తపు షాట్ ఫోటోను డీఎఫ్ఓ కి జ్ఞాపికగా అందజేశారు. ఉత్తమ షార్ట్ ఫిలిం విభాగంలో తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డు – 2025 గెలుచుకున్న సందర్భంగా చిత్ర బృందాన్ని సత్కరించారు. ?ఈ కార్యక్రమంలో దర్శకుడు మరియు నంది అవార్డు గ్రహీత వేముగంటి, నిర్మాతలు నిడిగొండ నరేష్ కుమార్ మరియు లింగంపల్లి చంద్రశేఖర్, ప్రముఖ నటుడు బ్రహ్మజీ (వనజీవి రామయ్య పాత్రధారి), నటి నాగరాణి (జనకమ్మ పాత్రధారి), సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ మరియు ఛాయాగ్రాహకుడు తోట వి. రమణ పాల్గొని, వారికి శాలువాలు మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు.
టి. దయాకర్ రెడ్డి మాట్లాడుతూ రామయ్య తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, జానకమ్మ కి పెన్షన్ అందేలా చూడాలని అధికారులను కోరారు. ?దర్శకుడు వేముగంటి మరియు చిత్ర బృందం తమకు అడుగడుగునా సహకరించిన డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# రావి పహాడ్ గ్రామ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి

**గ్రామ సర్పంచ్ కొత్తపల్లి సుశీల**

నల్గొండఅర్సీ,ఏప్రిల్ 9,తరంగాలు : రావి పహాడ్ గ్రామ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ కొత్తపల్లి సుశీల అన్నారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ తనను గ్రామ సర్పంచ్ గా గెలిపించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 118 ఓట్ల మెజార్టీతో తాను సర్పంచిగా గెలిచారని అన్నారు.గ్రామంలో విద్యుత్‌సమస్య పరిష్కారానికి ట్రాన్స్ఫార్మర్లు అధికంగా కావాల్సిన అవసరం ఉందన్నారు. జాన్ పాడ్ నుండి మహంకాళి గుడం వరకు రోడ్డు బాగుందని, జానపాడు నుండి తమ గ్రామానికి



రోడ్డు బాగాలేదని అన్నారు.రోడ్డు గుంతలు మయం కావడంతో ప్రయాణికులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మా గ్రామముకు 49 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయినవి, అందులో 44 ఇండ్లు నిర్మాణంలో ఉన్నవి, రానున్న ఐదు సంవత్సరాల కాలంలో గ్రామాన్నిఅన్ని రకాలుగా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం సునీత,వార్డ్ మెంబర్లు మామిడి పావని, మట్టయ్య,మేరమ్మ,లింగమ్మ ,సౌభాగ్యం, నారాయణదాసు హుస్సేన్నా,యకులు కొత్తపల్లి ఏసు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవిపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**




**హనుమకొండ ప్రతినిధి, ఏప్రిల్ 9,తరంగాలు :** హెచ్ఐవి గురించి ప్రజలలో అవగాహన ఉన్నప్పటికీ ఇంకా విస్తృతమైన అవగాహన పెంచడానికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాలలో బాగంగా హెచ్ఐవి అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ హెచ్ఐవి గురించి ఇంకా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందని పేర్కొన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశాలు ,స్వచ్ఛంద సంస్థలు ముందు వరుసలో ఉండి హెచ్ఐవి నియంత్రణకు కృషి చేస్తున్నారని, వారు నిత్యం ప్రజల్లో ఉంటారని ప్రజలతో ఉన్న సాన్నిహిత్యంతో అవగాహన ,నిర్ధారణ పరీక్షలు చికిత్స విధానం గురించి ప్రజలకు వివరించాలన్నారు. హెచ్ఐవి గురించి కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల కృషిని కలెక్టర్ అభినందించారు. వైద్యరంగంలో ఇప్పటికే చాలా పురోగతి ఉందని హెచ్ఐవి విషయంలో కూడా గర్భిణీ నుండి పిల్లలకు రాకుండా నివారించడానికి కూడా మంచి వైద్యం అందుబాటులో ఉందని, ట్రాన్స్ జెండర్లు, వలస కార్మికులు, ఇతర హై రిస్క్ గ్రూపులకు చెందిన వారికి ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సురక్షితమైన జీవన విధానంతో హెచ్ఐవి నివారణ సాధ్యమని అన్నారు. హెచ్ఐవి బారీనపడిన వారి పట్ల ఎలాంటి వివక్ష చూపకూడదని కలెక్టర్ పేర్కొన్నారు.
ఈ ర్యాలీ కలెక్టరేట్ నుండి అదాలత్ జంక్షన్ వరకు సాగింది. అదాలత్ కూడలి వద్ద మానవహారం నిర్వహించడం జరిగింది.
పట్టణ ఆరోగ్య కేంద్రాలు పోచమ్మకుంట , లష్కర్ సింగారం,శాయంపేట ఏఎన్ఎంలు, ఆశాలు ఇతర సిబ్బంది, సెయింట్ ఆన్స్ , సెయింట్ జోసెఫ్, ఫాదర్ కొలంబో నర్సింగ్ విద్యార్థులు , మారి, లోడి,ఆర్ డి ఎం ఎం, వార్డ్ ట్రకర్స్, వార్డ్ మై గ్రాంట్స్, వన్ స్టాప్ సెంటర్, లింక్ వర్కర్స్ స్కీమ్, పాజిటివ్ నెట్వర్క్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరి ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.అప్పయ్య, అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ రావు , డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రభుదాస్, డాక్టర్ రుబీనా, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మేనేజర్ స్వప్న మాధురి, కమలాకర్, డెమో వి.అశోక్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి ఎస్. శ్రీనివాస్ ,ఓ.చంద్రశేఖర్, మాధవ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, ఏ ఆర్ టి ,ఐ సి టి సి ,డి ఎస్ ఆర్ టి సి ఎస్ ఎస్ కె సిబ్బంది ఏఎన్ఎంలు ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# లోడి సంఘీక సేవా సంస్థ సేవలు అభినందనీయం




**హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్.రవి**

**హన్మకొండ ప్రతినిధి, ఏప్రిల్ 9,తరంగాలు** :లోడి సంఘీక సేవా సంస్థ సేవలు అభినందనీయమని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్.రవి అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక – ఆరోగ్య వారోత్సవాలలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మరియు లోడీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఫాతిమా నగర్ లోని లోడి సంఘీక సేవా సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద మెగా ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్ రవి దిర్ఘకాలిక వ్యాధి తో జీవిస్తున్న చిన్నారులకు పోషక ఆహార కిట్స్ పంపిణి చేశారు.అనంతరం లోడీ సంఘీక సేవా సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి సమాజ ప్రగతికి చిహ్నాలు కనుక వారికి విద్య, వైద్యం మరియు నాణ్యమైన పోషక ఆహారాన్ని అందించడం ద్వారా ఆరోగ్య సమాజాన్ని సాధించవచ్చు అని తెలియజేయడం జరిగింది. చిన్నారులకు నైతికంగా, అండగా ఉండడమే కాకుండా వారికి మనోధైర్యాన్ని ఇస్తూ పోషకాహార కిట్ లను అందిస్తున్న లోడి సంస్థ ను ఆయన అభినందించారు. ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో ప్రభుత్వ విభాగాలతో పాటు స్వచ్ఛంద సంస్థల కృషిని ఆయన అభినందించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.అప్పయ్య మాట్లాడుతూ పిల్లలు అతిసాధారణంగా ఎదురుకునే రక్తహీనత, ఎత్తు కు తగ్గ బరువు వంటి సమస్య లను ఆదిగమించడానికి ఇటువంటి పోషకహార కిట్స్ ఎంతగానో ఉపయోగ పడతాయని తెలియజేసారు.




లోడి స్వచ్ఛంద సంస్థ గత 20 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం ద్వారా 250 మంది చిన్నారులకు ప్రతి రెండు నెలలకు ఒకసారి అందించడానికి ముందుకు రావడం చాలా అభినందనీయమని పాదర్ ఇన్నారెడ్డి ద్వారా ఇలాంటి సేవలు ఇంకా అందించే దిశ గా కృషి చేయాలని అడిషనల్ డి ఎం హెచ్ ఓ డా.మదన్మోహన్ రావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న మాధురి, డెమో అశోక్ రెడ్డి ఐసీటీసీ సూపర్వైజర్ రామకృష్ణ, డాటా మేనేజర్ కమలాకర్,ఫోగ్రాం కోఆర్డినేటర్ వీరబాబు, బాల శౌరీ, నాగేష్,లోడి సేవా సంస్థ కార్యకర్తలు శిరీష, అనిత, రాకేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




# ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో అంగన్వాడీలది కీలక పాత్ర





**పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ సులభతరం**

- **అంగన్వాడీ టీచర్ల పని తీరు మెరుగుపర్చేందుకు నూతన స్మార్ట్ ఫోన్ల పంపిణీ**
- **పిల్లలను స్వంత బిడ్డలుగా చూసుకోవాలి -- వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి**
- **అంగన్వాడీ టీచర్లకు 146 మొబైల్ ఫోన్లు పంపిణీ చేసిన ఎంపీ కావ్య, చైర్మన్ ఇనుగాల, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**హన్మకొండ ప్రతినిధి,09 ఏప్రిల్,తరంగాలు** : పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర అత్యంత కీలకమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగంగా హన్మకొండ జిల్లా కాజీపేట మండలం పరిధిలోని మడికొండ లోని 'మా' గార్డెన్స్ నందు వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని హన్మకొండ జిల్లా హసన్పర్తి, కాజీపేట, ఐనవోలు మండలాలకు చెందిన 146 మంది అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను వరంగల్ ఎంపీ కడియం కావ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ చిన్నారులకు అత్యధిక పోషక విలువలు కలిగిన బాలామృతం అందిస్తున్నట్లు చెప్పారు. మహిళా శిశు సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, అంగన్వాడీ కేంద్రాల్లోనే ప్రీ స్కూల్స్ ఏర్పాటు చేసి చిన్నారులకు ఇంగ్లీష్ మీడియంలో బోధన అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలకు అనుబంధంగా ప్రీ స్కూల్స్ నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల పోషణ, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అంగన్వాడీ టీచర్లకు అందజేస్తున్న మొబైల్ ఫోన్ల ద్వారా పోషణ్ ట్రాకర్ యాప్ సహాయంతో పిల్లల ఆరోగ్య వివరాలు, పోషకాహార కార్యక్రమాల సమాచారాన్ని సులభంగా నమోదు చేసి పై అధికారులకు పంపే అవకాశం కలుగుతుందని



చెప్పారు. దీంతో సేవలు మరింత పారదర్శకంగా, వేగంగా ప్రజలకు అందుతాయని పేర్కొన్నారు.గ్రామ స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే ముఖ్యమైన బాధ్యత అంగన్వాడీ సిబ్బందిదేనని, వారి సేవలను ప్రభుత్వం గుర్తిస్తూ అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నదని అన్నారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహారం మరియు మహిళల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.

అంగన్వాడీ సిబ్బంది తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి చేరవేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా సీడీపీఓ స్వరూప రాణి, సూపర్వైజర్లు, అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగం ఇప్పిస్తానని నా భార్యను నాకు దూరం చేశాడు

**•న్యాయం చేయాలని పిల్లలతో భర్త వేడుకోలు**



**పరకాల, ఏప్రిల్ 9,తరంగాలు :**

పోలీసు ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి లోబర్చుకుని ఓ వివాహితతో ఓ యూట్యూబ్ ఛానల్ విలేఖరి నాకు నా పిల్లలకు అన్యాయం చేశాడంటూ మొహమ్మద్ మసూద్ పరకాల పట్టణ ప్రెస్ క్లబ్ లో తన గోడును వెల్లబోసుకున్నాడు. తాను పేరున్న విలేకరిని,పెద్ద పెద్ద పోలీస్ అధికారులతో మంచి సంబంధాలు ఉన్నాయని ఓ వివాహితకు మాయ మాటలు చెప్పి పోలీసు ఉద్యోగం ఇప్పిస్తానని తన కూతురు వయసు ఉన్న వివాహితను ట్రాప్ లో పడేసిన ఓ యూట్యూబ్ ఛానల్ సిఇఓ నయీమ్ పాషా అసలు రూపం బట్టబయలైంది. ఓ వివాహిత కుటుంబానితో ఉన్న దూరపు బంధుత్వాన్ని ఆసరాగా చేసుకుని సదరు విలేఖరి ఆ మహిళతో చనువు ఏర్పర్చుకొని పోలీస్ ఉద్యోగం ఇప్పిస్తానని 6 తులాల బంగారాన్ని కూడా కాజేశాడు.బంగారంతో వివాహిత ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో తన ఇద్దరు పిల్లలతో భర్త,తల్లి దండ్రులతో కలిసి పరకాల ప్రెస్ క్లబ్ కు వచ్చి గోడును వెళ్ళబోసుకున్నారు.విలేకరులకు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన నయీమ్ పాషా పరకాలలో యూట్యూబ్ ఛానల్ విలేఖరి గా పని చేస్తూ హన్మకొండ జిల్లా కమలాపురం కు చెందిన ఎండి మసూద్ కుటుంబంతో పరిచయం ఏర్పర్చుకున్నాడు.ఈ క్రమంలో మసూద్ భార్యకు పోలీస్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి చనువు పెంచుకొనినా భార్యకు మాయ మాటలు చెప్పి ఉద్యోగం పేరిట 6 తులాల బంగారం, నా భార్యను లోబరుచుకున్నాడని వివాహిత భర్త మసూద్ తెలిపారు.కొద్ది రోజుల క్రితం ఇంట్లో చెప్పకుండా తన భార్య వెళ్ళిపోయిందని, దీనికి విలేఖరి నయీమ్ పాషా కారణమని చెప్పాడు. విలేఖరి ముసుగులో తన కుటుంబానికి ద్రోహం చేసిన నయీమ్ పాషా నుంచి తమకు న్యాయం చేయాలని, ఈ విషయమై పోలీసులను ఆశ్రయించనున్నట్లు మసూద్ తో పాటు ఆయన తండ్రి రాజ్ మహ్మద్ విలేకరులకు తెలిపారు.

# ఎయిడ్స్‌పై అవగాహనతోనే నివారణ సాధ్యం

**•వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద**




**వరంగల్ ప్రతినిధి , 09 ఏప్రిల్, తరంగాలు :**

ఎయిడ్స్‌పై అవగాహనతోనే నివారణ సాధ్యమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు.ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాల అమలులో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాల కిందనాలుగో రోజు ఎయిడ్స్‌పై అవగాహన, నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ ) వద్ద నుండి ఎంజీఎం ఆసుపత్రి కూడలి వరకు నిర్వహించిన రెడ్ రన్ వాకథాన్ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో జిల్లా అధికారులు, వైద్య అధికారులు, ఆశాలు, సిబ్బంది, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, చేతిలో ప్లకార్డులు చేతబూని "ఎయిడ్స్ నివారణ" నినాదాలతో ప్రజలకు సందేశం అందించారు. ర్యాలీ అనంతరం ఎంజీఎం కూడలి వద్ద నిర్వహించిన మానవహారంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, ఎయిడ్స్ ( హెచ్ఐవి/ఎయిడ్స్ )పై సమాజంలో సరైన అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఎయిడ్స్ పై సరైన జాగ్రత్తలు తీసుకుంటే దీని వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.అసురక్షిత లైంగిక సంబంధాలు, సంక్రమిత రక్త మార్పిడి, కలుషిత సూదులు/సిరంజీల వినియోగం ద్వారా ఈ వ్యాధి వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సురక్షిత పద్ధతులను అనుసరించడం, అవసరమైనప్పుడు హెచ్ ఐ వి పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందవచ్చని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు, చికిత్స, కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని, బాధితులు భయపడకుండా వాటిని వినియోగించుకోవాలని సూచించారు.వరంగల్ జిల్లాలో నర్సంపేట, వర్ధన్నపేట, ఎంజీఎం, సీకేఎం ప్రభుత్వ దవాఖానల్లో ఉచితంగా ఎయిడ్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుమానం ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి గర్భిణీ స్త్రీకి కూడా ఎయిడ్స్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తూ, తల్లి నుంచి బిడ్డకు వ్యాధి సంక్రమించకుండా నివారణ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే ఏఆర్టీ కేంద్రాల ద్వారా వారికి ఉచిత చికిత్సలు అందిస్తున్నారని తెలిపారు. హెచ్ ఐవి బాధితుల పట్ల వివక్ష చూపకుండా మానవతా దృక్పథంతో సహకరించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు.ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు పాఠశాలలు, కళాశాలలు, గ్రామ మరియు పట్టణ స్థాయిలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని, ఇటువంటి ర్యాలీలు సమాజంలో చైతన్యం తీసుకువస్తాయని కలెక్టర్ తెలిపారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్లెల్లో, పట్టణాల్లో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు కళాజాతలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ కార్యక్రమాలలో పాల్గొని, వ్యాధి గురించి సరైన సమాచారం తెలుసుకోవాలని డిఎం హెచ్ ఓ కోరారు.ఈ సందర్భంగా వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో కార్మికుల కోసం నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంప్‌ను కలెక్టర్ ప్రారంభించి వైద్య పరీక్షలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వైద్య గణేష్, సంధ్యారాణి, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, జిల్లా అధికారులు, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులు,ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎన్జీఓలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.